# మహా శిల్పాలు




— ప్రతాపరవిశంకర్.

బంధువులందరికీ పెళ్లిగ్రాంలు వెళ్ళిపోయాయి క్రితం రోజు సాయంత్రమే. కొంచెం దగ్గర ఊళ్ళలో వున్న వాళ్ళు ఒక్కొక్కరే తెల్లవారేసరికి పెట్టె బేడా వేసుకు దిగుతున్నారు రిక్షాల్లోంచి, ఆటోల్లోంచి. వచ్చినవాళ్ళు, దూర ప్రాంతంనుంచి రావలసిన వాళ్ళ కోసం ఎదురు చూస్తున్నారు.

ఆ ఇంటిని అప్పటికే ప్రేతకళ కప్పి వేసింది. ఎవరి ముఖంలో చూసినా పుట్టెడు విచారం ద్యోతకమవుతోంది. ఎవరికి వాళ్ళే జరగబోయే దాన్ని గురించి ఆలోచిస్తున్నారు.

"పెద్దవాడికి పెళ్లిగ్రాం ఎప్పుడు ఇచ్చారు?" అడిగాడొకాయన ఓ యువకుడిని.

"నిన్న సాయంత్రమే ఇచ్చాం మామయ్యా!"

"అయితే రాత్రి పన్నెండు గంటలకు వాడికి చేరుతుందా?"

"ఏమోమరి! మద్రాసుకేగా-చేరే వుంటుంది."

"మరి వాడికి వెంటనే రావడానికి ట్రెయినేదయినా వుందా?"

"ఏమోమరి! ట్రయిన్ లేక పోయినా టాక్సీలో అయినా వస్తాడు సుబ్బులు బాబాయ్!" గట్టిగా చెప్పాడతను.

"రుక్మిణికి కబురు వెళ్ళిందటే సావిత్రీ?" ఓ యాభై ఏళ్ళామె ఓ పాతికేళ్ళ సావిత్రిని అడిగింది.

"మా చిన్న మరిదిని పంపించాం పిన్నీ! వాళ్ళుండేది రాజమండ్రేకదా! బహుశా ఇంకో గంటలో రావచ్చు" అన్నదామె.

సావిత్రి అలా అన్నదో లేదో, ఇంటిముందు రివ్వున వచ్చి ఓ ఆటో రిక్షా ఆగింది. అందులోనించి రుక్మిణీ, ఆమె మొగుడూ, ఇద్దరు పిల్లలూ దిగారు.

"అదిగో రుక్మిణి వచ్చింది" అన్నది సావిత్రి.

ఆయన ఆటో వాడికి డబ్బు లిస్తున్నాడు, పిల్లలు అక్కడే వున్నారు.

పెద్దగా ఏడుస్తూ లోపలకు వచ్చింది రుక్మిణి— "నాన్నా" అంటూ. వెంటనే ఓ ఇద్దరు ఆడవాళ్ళు రుక్మిణిని చుట్టుముట్టారు.

"ఏడవకే అమ్మాయ్! పెద్ద తనం- నువ్వు బెంబేలు పడిపోతే మీ అమ్మ నిలవగలదా?" అన్నదో

పెద్ద ముత్తయిదువ మెల్లగా.

సరాసరి పంచలో వున్న తండ్రి మంచం దగ్గరకు వెళ్ళింది రుక్మిణి. తండ్రి మంచంలో. లేడు. కింద పడుకోబెట్టారు ఆ రాత్రి పది గంట లప్పుడు-డాక్టర్ ఇక ఆయన ఎటు వంటి పరిస్థితులలోనూ బ్రతకడని పెదవి విరిచిన తర్వాత. ఆయన అపస్మారకంలో వున్నాడు. ఆయన తల దగ్గర భార్య వర్ధనమ్మ కూర్చుంది.

కూతుర్ని చూడగానే బావురు మందామె. ఇద్దరూ సన్నగా ఏడుస్తు న్నారు.

అక్కడ నిల్చున్న అమ్మ లక్కలందరూ కళ్ళు ఒత్తు కున్నారు.

"ఒక్కర్తే కూతురని ఎంత గారాబంగా పెంచాడాయన! దాని చిన్నతనం నాకు బాగా తెలుసు. అది ఆడింది ఆట, పాడింది పాట!" చెప్పుకొంటున్నారు.

"పెద్దవాడు సుబ్బారావు ఎన్ని గంటలకొస్తాడో?"

"రావద్దూ! దగ్గిరా— దాపా? మద్రాసునించి రావాలిగదా!"

ముగ్గురు కొడుకుల్లో ఒక కొడుకు తండ్రి దగ్గరే వున్నాడు. మరో కొడుకుదగ్గర్లోనేవుండటంతో. తెల్లవారుజామునే వచ్చాడు. అందరూ పెద్ద కొడుకు కోసం ఎదురు చూస్తున్నారు.

ఆ ఇంటిముందు రిక్షాలు పది నిమిషాలకోసారి వచ్చి ఆగుతూనే వున్నాయి. వాటిల్లోంచి ఒకరో ఇద్దరో బంధువులు దిగుతూనే వున్నారు. కొంతమంది పెళ్ళికి వచ్చినట్టు పిల్లలను కూడా తీసుకు వస్తున్నారు. వచ్చిన వాళ్ళకు కొంత మంది వయసులో వున్న అమ్మా యిలు కాఫీలు అందిస్తున్నారు.

"ఎప్పుడు కింద పెట్టారు?" అరగంట క్రితం ఆటోలోనించి దిగిన ఓ లావుపాటి ఖద్దరు చొక్కా ఆయన ఇంకో లావు పాటావిడను అడిగాడు.

"నిన్న రాత్రి పది గంటలకి. ముగ్గురు డాక్టర్లు ఎన్ని రకాల మందులో వాడారు. అయినా ఉప యోగం లేకపోయింది. ఇక గంటల్లో పడ్తాడన్నారు. ఆ కాస్త ప్రాణం పోకముందే సుబ్బారావు వస్తే బావుండు" అన్నదామె.

ఆయన నిజమేనన్నట్టు తల వూగించాడు.

ఆమె పంచలోకి వెళ్ళి పోయింది.

రుక్మిణి ఇంకా ఏడుపు ఆప లేదు. పిల్లలను అక్కడ వుండ నీయకుండా బయటకు పంపించారు.

"ఓ పక్క ఆయన చావు బతు కుల్లో వుంటే ఇంకా ఈమె పట్టు చీరలు, వంటి నగలు వదల్లేదే పిన్నీ!" ఒకామె పక్కనున్నామె చెవి కొరికింది.

"అలా అనకు. ఆయన బాగా వున్నప్పుడే శాపించాడట-ఎప్పుడూ అరచేతి వెడల్పు జరీ వున్న పట్టు చీరెలూ, వంటినిండా నగలు, కాళ్ళకు పారాణితో తన కళ్ళకు కనిపించాలని. అప్పటినించీ ఆమె అలాగే ఉంటోంది. ఆమెను మామూలు చీరలో నగల్లేకుండా ఇంతవరకూ నేను చూళ్ళేదు" అన్నదామె.

పక్కనున్నామె మరి నోరెత్త లేదు. 'ఇదెక్కడి వింత' అన్నట్టు ఓ మారు ఆమెకేసి చూసింది. భర్త ముఖంలోకి దిగులునిండిన కళ్ళతో చూస్తుందామె— వర్ధనమ్మ.

ఎండెక్కుతోంది. ఆకాశపు నడి కప్పుకు ప్రాకుతున్నాడు ఎర్రటి సూర్యుడు. కొంతమంది పిల్లలు ఆకలికి తట్టుకోలేక ఏడు పుకు లంకించుకొన్నారు.

వర్ధనమ్మ భర్త దగ్గర్నించి లేచింది. నీరసంగా ఇంట్లోకి నడి చింది.

"ఒక్కసారి కళ్ళు తెరువ్ నాన్నా! నన్ను చూడు.... నేను నాన్నా-రుక్మిణిని. ఒక్కసారి నన్ను చూడు నాన్నా!" ఏడుస్తూనే మధ్యలో అంటోంది రుక్మిణి.

రుక్మిణిని ఇద్దరు ఆడబడుచులూ ఓదారుస్తున్నారు.

"సుబ్బారావుకు అసలు టెలి గ్రాం అంది వుంటుందా?" ఒకా యన వున్నట్టుండి అనుమానం వెలిబుచ్చాడు.

"అందకేమవుతుంది?"

"మరి ఇంతవరకూ రాలేదేం? ఎందుకయినా మంచిది- ఇంకో టెలిగ్రాం ఇవ్వండి."

"ఇంకో గంట చూద్దాం."

"ఇంతకీ విశ్వనాథం మామ య్యకు ఎన్నేళ్ళు?" అడిగాడాయన చుట్ట ముట్టించుకోబోతూ.

"ఎన్నేళ్ళు లేకేం? ఎనభై నాలుగు."

"అబ్బో! తక్కువేం గాదు.

అదృష్టవంతుడు, అన్ని కోరికలూ తీరిన తర్వాతే పోతున్నాడు."

పక్కాయన మాట్లాడలేదు.

ఇంతలో లోపల్నించి పంచ లోకి పచ్చింది వర్ధనమ్మ.

ఆమె తలారా స్నానం చేసింది. ముగ్గు బుట్టలా వున్న జుట్టులోంచి ఇంకా నీళ్ళు కారుతున్నాయి. నుదుట రూపాయి కాసంత ఎర్రటి కుంకుమబొట్టు, పాపిట్లో మరో బొట్టు. వంగపండు రంగు పట్టు చీర కట్టుకుంది. మెడనిండా నగలు. రెండు చేతులకూ నాలుగేసి బంగారు గాజులు, నడుముకు వడ్డానం, మెడలో కాసులపేరూ - నాంతాడూ - జిగినీ గొలుసు, పాదాలకు పారాణి.

అందరూ ఆమెనే ఆశ్చర్యంగా చూస్తున్నారు.

"లక్ష్మీదేవిలా వుంది. ఎంత కళ! ఇలా పసుపు కుంకుమలతో కళకళలాడే ముత్తయిదువ మరి కొన్ని గంటల్లో...." ఆలోచించిన వాళ్ళకు గుండె తరుక్కుపోయింది.

వర్ధనమ్మ వచ్చేసరికి ఆయన చుట్టూవున్న వాళ్ళు పక్కకు తప్పుకున్నారు.

ఆమె వచ్చి భర్తపాదాలనుతాకి దణ్ణం పెట్టుకుంది. ఆయన పాదాల దగ్గర రెండు మందార పూలను వుంచి, వాటిని తీసుకొని కొప్పులో పెట్టుకుంది.

ఇదంతా చూడగానే రుక్మిణి ఏడుపును మరింత పెద్దది చేసింది.

అందరూ కళ్ళ నీళ్ళు పెట్టు కున్నారు.

"మహారాజు- పార్వతీదేవి లాంటి భార్య చేతిలో పోతున్నాడు" అనుకున్నారు.

నిశ్చలంగా భర్త ముఖంలోకి చూస్తూ కూర్చుంది వర్ధనమ్మ.

పన్నెండు గంటలు దాటింది.

సూర్యుడు నిప్పులు కురిపిస్తున్నాడు

"సుబ్బారావుకు ఇంకో టెలిగ్రాం ఇవ్వండ్రా" అన్నాడాయన వాచీ కేసి చూసుకొని. ఇంకాఆయన చేతిలో చుట్ట అల్లాగేవుంది.

ఇంతలోనే బయట టాక్సీ ఆగింది. అందులోనించి సుబ్బారావు, భార్యాపిల్లలతో దిగాడు.

"అదుగో సుబ్బారావొచ్చాడు!" ఎవరో అన్నారు.

"టెలిగ్రాం ఎప్పుడు అందిందిరా సుబ్బులు?" అడిగాడాయన దమ్ము లాగుతూ.

సుబ్బారావు మాట్లాడలేదు. గబ. గబా నడుస్తూ పంచలోకి వచ్చాడు.

పెద్దకొడుకును చూడగానే వర్ధనమ్మకు దుఃఖం ఆగలేదు. పమిట చెంగును నోట్లో కుక్కుకొని అక్కడి నించి లోపలకు వెళ్ళిపోయింది.

"ఒరేయ్ అన్నయ్యా!" అని బావురుమంది రుక్మిణి.

సుబ్బారావుకు కన్నీళ్ళు ఆగలేదు. కర్చీఫ్ తీసి కళ్ళు వొత్తుకున్నాడు. సుబ్బారావు భార్య వచ్చి రుక్మిణి పక్కనే కూలబడింది.

"వదినా! నాన్న మనకు అన్యాయం చేస్తున్నాడు." రుక్మిణి రోదిస్తోంది.

ఒంటి గంటయింది.

"అమ్మ ఎక్కడ?" అన్నాడు సుబ్బారావు - పూడుకుపోయిన గొంతుతో, తమ్ముడితో.

"లోపల వుంది."

లేచి లోపలకు వెళ్ళాడు సుబ్బారావు. తల్లి కనిపించలేదు. ఇల్లంతా వెతికాడు. ఎక్కడా కనిపించలేదు.

నిమిషాల మీద వర్ధనమ్మ ఇంట్లో లేదనే విషయం అందరికీ తెలిసిపోయింది.

ఎవరికో ఏదో అనుమానం వచ్చింది. నిమిషాల మీద ఇద్దరు మనుషులను తీసుకు వచ్చారు— దొడ్లో వున్న నూతిలో దింపారు.

వాళ్ళు ఓ గంటన్నర శ్రమపడి వర్ధనమ్మ శవాన్ని బయటకుతీశారు.

అనుకోని సంఘటన! అందరూ దిగ్భ్రమ చెందారు!

ఘొల్లుమన్నారు.

ఎంత విచిత్రం!

"భర్త వుండగానే పసుపుకుంకుమలతో ముత్తయిదువగా పోవాలని ఎంతటి త్యాగం చేసింది మహా ఇల్లాలు" అన్నారు.

నిమిషాలమీద పనులు మొదలయినాయి.

ఆ సాయంత్రం సూర్యుడు గూటికి చేరకముందే వర్ధనమ్మ శరీరం చితిలో చేరిపోయింది.

ఇల్లంతా శోకమయం.

ఆ రాత్రివరకూ ముసలాయన అలాగే పడివున్నాడు. తెల్లవారు జామున ఆయనలో చలనం కలిగింది. రాత్రయ్యే సరికి చిన్నగా మాట్లాడటం మొదలు పెట్టాడు.

అందిరితోపాటు డాక్టర్లుకూడా విస్తుబోయేరు. "మృత్యుంజయుడీయన" అన్నారు.

ఆ తర్వాత ఆ మృత్యుంజయుడు ఓ ఫూలిష్ సెంటిమెంటుతో తన కోసం త్యాగం చేసిన మహాఇల్లాలి తద్దినాలను వరుసగా ఎనిమిదేళ్ళు పెట్టాడు. *